

కాచిగూడలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

అంబర్‌పేటను అభివృద్ధి చేశా.. అండగా నిలవండి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో కమలం జెండా మరోసారి ఎగరడం ఖాయమని కేంద్రం మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

గురువారం కాచిగూడ డివిజన్ మౌలానా ఆజాద్‌నగర్, చప్పల్‌బజార్, జమాల్‌బస్తీ, మోతీ మార్కెట్ తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలు తనకు అండగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాల్లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కోశాధికారి ఎ. సూర్యప్రకాష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు..

ఎంపీ సీటు కేటాయించకపోవడం అన్యాయం

రాంనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎంపీ సీట్ల కేటాయింపులో కాంగ్రెస్ మాదిగలను మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్ అన్నారు. గురువారం రాంనగర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూడు ఎస్సీ రిజర్వు స్థానాల్లో మాదిగలకు ఒక్క సీటు ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలు కాంగ్రెస్‌కు ఓటు ద్వారా బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎం.రవీందర్, తాండ్ర మురళి, జి.మహేష్, నర్సింగ్‌రావు, రోహిణ్, వినయ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్ చౌరస్తాలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



మాట్లాడుతున్న టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు సాయిబాబా

ఉద్యోగ విరమణ చేసి మూడేళ్లయినా అదే పోస్టులో..

తొలగించకపోతే జీహెచ్ఎంసీ ఎదుట ధర్నా చేస్తాం : టీడీపీ

రాంనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసి మూడేళ్లయినా జీహెచ్ఎంసీలో ఫైనాన్స్ విభాగం అడిషనల్ కమిషనర్‌గా కొనసాగుతున్న జయరాజ్ కెనెడీని తొలగించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు టీడీపీ లేఖలు రాసింది. గురువారం నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా, ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడారు.

జయరాజ్ కెనడీ పదేళ్లుగా ఒకే పోస్టులో కొనసాగడంతో పదవిని అడ్డుపెట్టుకొని అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీలో 200కు పైగా బ్యాంకు ఖాతాలలో ఆర్థిక లావాదేవీలు కొనసాగిస్తూ బ్లూమూన్ అనే సంస్థతో కుమ్మక్కై వారికి లబ్ధి చేకూరుస్తున్నారని అన్నారు. ఆయనను ఆ పోస్టు నుంచి తొలగించకపోతే టీడీపీ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ, ఎన్నికల కమిషనర్ కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగు నగేష్, నాయకులు జి.యాదగిరిరావు, కప్ప కృష్ణగౌడ్, ఎస్. ప్రకాష్, బి. రాజు తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

డ్రైనేజీ పైపులైన్ పనులను త్వరగా పూర్తిచేయండి

అంబర్‌పేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): న్యూపటేల్‌నగర్‌లో నిర్మిస్తున్న డ్రైనేజీ పైపులైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ అధికారులను కోరారు. గురువారం ఆయన పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు పాల్గొన్నారు.

'మూగ జీవాల కోసం నీటి ఏర్పాట్లు చేయండి'

రాంనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలకు మూగజీవాలు మృత్యువాత పడకుండా తక్షణమే ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల కార్యాలయాల పరిధిలో దాహార్తి తీర్చేందుకు అవసరమైన నీటి గిన్నెలు, తొట్లు ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని ఎన్వీరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు సీహెచ్.రంగయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. మూగజీవాల దాహార్తి తీర్చేందుకు జీహెచ్ఎంసీ ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు.



చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ రాకేష్

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి : డాక్టర్ రాకేష్

ముషీరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎండలు తీవ్రమైన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని భోలక్‌పూర్‌లోని బైబిల్ హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాకేష్ సూచించారు. గురువారం రంగానగర్‌లో ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వడదెబ్బ తగిలిన వారిలో నీరసం, వాంతులు, తలనొప్పి, కండరాల బలహీనత తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోగల ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారి డాక్టర్ దీప్తి ప్రియాంక ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మీబాయి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ కె. హనుమంతు ముదిరాజ్ కోరారు. గురువారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమ్మద్, వైస్ చైర్మన్ జక్కుల మల్లేష్‌గౌడ్, సుశీల్‌తో కలిసి కె.హనుమంతు మాట్లాడారు. 2013 సంబంధించిన బాండ్ డబ్బులు సిక్‌లో ఉన్నవారికి ఇవ్వకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బాండ్ డబ్బులు డ్రైవర్స్‌కు ఇచ్చారని, మిగతా ఉద్యోగులకు వెంటనే ఇవ్వాలని కోరారు. మహాలక్ష్మి టికెట్ల విషయంలో కండక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎండీకి వారు వివరించారు.



ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కె.హనుమంతు ముదిరాజ్ తదితరులు

29న భారతీయ నృత్యోత్సవం

రాంనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ డ్యాన్స్ డే సందర్భంగా ఈనెల 29న తెలంగాణ బాలోత్సవం, భారతీయ నృత్యోత్సవం నిర్వహిస్తున్నామని ప్రముఖ నృత్య గురువు రమణిసిద్ధి, ఇందిర, సమన్వయకర్త, కె. సుజావతి, తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ ఆచార్య అలేఖ్య పుంజాల, ఐఏఎస్ విశ్రాంత అధికారి డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు పాల్గొంటారని అన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ నృత్య గురువు రమణిసిద్ధి

ప్రతీ ఇంటిపై కమలం జెండా ఎగురవేయండి

రేపు బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

బర్కత్‌పుర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 6వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నామని పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు తెలిపారు. పార్టీ ఆవిర్భవించి 44 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతీ కార్యకర్త తమ ఇంటిపై కమలం జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. గురువారం బర్కత్‌పురలో నగర కార్యాలయంలో గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్ అధ్యక్షతన పోలింగ్ బూత్ అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, నాయకులు కె.నర్సింగ్‌రావుయాదవ్, ఎల్.రమేష్, కె.రవీందర్, ఎం.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు

అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు భూములను స్వాధీనం చేసుకోవాలి

నల్లకుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు భూములను స్వాధీనం చేసుకోవాలని ఆలిండియా ముస్లిం మైనారిటీ ఆర్గనైజేషన్ చైర్మన్ సయ్యద్ ముక్తార్ హుస్సేన్ డిమాండ్ చేశారు. గురువారం హైదర్‌గూడలో ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి ఏపీ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎం.ఏ.సిద్దీఖీతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డుకు సంబంధించి 77 వేల ఎకరాల భూములు ఉండగా.. అందులో చాలా వరకు కబ్జా అయ్యాయన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ముస్లిం గ్రేవ్‌యార్డులకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు వక్ఫ్‌బోర్డు భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ముస్లిం మైనారిటీ ఆర్గనైజేషన్ నాయకుడు నయీముల్లా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సయ్యద్ ముక్తార్ హుస్సేన్, ఎంఏ సిద్ధిఖీ తదితరులు

14 గంటలపాటు గానవిభావరి

చిక్కడపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వంశీ మోహనరాగాలు సంస్థ ఆధ్వర్యంలో గురువారం 14 గంటలపాటు నాన్‌స్టాప్‌గా 140 పాటలను మధురంగా ఆలపించారు. త్యాగరాయగానసభలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు, ప్రముఖ గాయకులు మెలోడీ కింగ్ వంశీమోహన్‌కుమార్ పలువురు గాయకులతో కలిసి నాలుగు భాషల్లో గీతాలు ఆలపించారు. 14 సోలో సాంగ్స్, 14 మేల్ డ్యూయెట్స్ పాటలు, 14 హిందీ సాంగ్స్, 14 కో-సింగర్స్‌తో కలిపి 98 సాంగ్స్ ఆలాపన, 14 మంది మ్యూజిక్ డైరెక్టర్స్ కంపోజ్ చేసిన గీతాలను 14 మంది ప్లేబ్యాక్ సింగర్స్‌తో కలిసి వంశీమోహన్‌కుమార్ ఆలపించారు. రాత్రి జరిగిన ముగింపు కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థల ప్రతినిధులు బింగి నరేందర్‌గౌడ్, చింతపట్ల వెంకటాచారి, పెద్ది కె. ఈశ్వర్ ఆయనకు రికార్డులు అందజేశారు.



వంశీ మోహన్‌కుమార్‌కు రికార్డులను అందజేస్తున్న సంస్థల ప్రతినిధులు

బీసీల డిమాండ్ల సాధనకు జోడోయాత్ర : ఆర్. కృష్ణయ్య

బర్కత్‌పుర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు 10 ఎంపీ సీట్లు కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీల న్యాయమైన డిమాండ్లను ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని కోరారు. బీసీలను విస్మరించిన పార్టీని ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని ఆయన హెచ్చరించారు. గురువారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గువ్వల భరత్‌కుమార్ సంయుక్తాధ్వర్యంలో జాతీయ కోర్ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల డిమాండ్ల సాధనకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జోడో యాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీ కులగణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ ఉద్యోగుల ప్రమోషన్లపై రాజ్యాంగ సవరణ చేయాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 56 శాతానికి పెంచాలని, క్రీమీలేయర్‌ను రద్దుచేయాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో పలు బీసీ సంఘాల నాయకులు నీల వెంకటేష్, సుధాకర్‌ముదిరాజ్, నందగోపాల్, వేముల.రామకృష్ణ, జిల్లపల్లి అంజి, ఉదయనేత, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణయ్య

కిమ్స్‌లో అరుదైన చికిత్స

- బాలికకు మూడు వాల్వ్‌ల మార్పు

రాయదుర్గం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స చేశారు వైద్యులు. మియాపూర్‌కు చెందిన మీనా(16) అనారోగ్యంతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు కిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ఆమెకు పరీక్షలు నిర్వహించి గుండెలోని మూడు ప్రధాన వాల్వ్‌లు మిట్రల్, ట్రైకస్పిడ్, అయోర్టిక్ వాల్వ్‌లలో లీకేజీ ఉందని గుర్తించారు. డాక్టర్ నిసర్గ బృందం 9 గంటలపాటు శ్రమించి మూడు వాల్వ్‌లను మార్చారు. శస్త్రచికిత్స చేసిన రెండో రోజు నుంచే ఆమె నడవడం మొదలు పెట్టింది.

ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 3న ఢిల్లీ క్యాపిటల్స్ కోల్‌కొత నైట్ రైడర్స్ జట్ల మధ్య ఐపీఎల్ మ్యాచ్‌కు సంబంధించి బెట్టింగ్ జరుగుతుందని ఫిలింనగర్ పోలీసులకు సమాచారం అందింది. షేక్‌పేట వినాయకనగర్‌కు చెందిన రావుల్‌కోల జగదీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. క్రికెట్ లైన్ గురు యాప్‌లో మ్యాచ్ చూస్తూ ఆఫ్‌లైన్‌లో బెట్టింగ్ స్వీకరిస్తున్నట్టు తేలింది. అతడిపై కేసు నమోదు చేశారు.

అగ్గిపెట్టె ఉందా.. అని అడుగుతూ సెల్‌ఫోన్ స్నాచింగ్

పంజాగుట్ట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): క్యాబ్ డ్రైవర్ సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయాడు ఓ ఆగంతుకుడు. మల్లాపూర్ గోకుల్‌నగర్‌కు చెందిన ఎస్.సాయికుమార్ అమీర్‌పేటలో కేపీఎం మాల్ వద్ద గురువారం తెల్లవారుజామున క్యాబ్‌లో కూర్చున్నాడు. అదే సమయంలో ఓ ఆగంతుకుడు వచ్చి అగ్గిపెట్టె ఉందా అని అతడిని అడిగాడు. సమాధానం చెప్పే లోపు సాయికుమార్ చేతిలో ఉన్న ఫోన్ లాక్కొని పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు పట్టడానికెళ్లి..

చెరువులో పడి యువకుడి మృతి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చేపలు పట్టడానికి వెళ్లిన ఓ యువకుడు చెరువులో పడి మృతిచెందాడు. ఘట్‌కేసర్ ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేటకు చెందిన మహ్మద్ గౌస్ పాషా భార్య, కుమారుడు మహ్మద్ అర్బాజ్ అలీ(20)తో కలిసి ఈ నెల 2న ఘట్‌కేసర్ మండలం, అవుషాపూర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి వచ్చారు. ప్రార్థనలు ముగిసిన తరువాత అర్బాజ్‌అలీ తల్లిదండ్రులకు చెప్పకుండా ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. తల్లిదండ్రులు అర్బాజ్ కోసం వెతికి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం మధ్యాహ్నం గొర్రెల కాపరి చెరువులో మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీసి గౌస్‌పాషాను పిలిపించారు. కుమారుడి మృతదేహాన్ని చూడగానే అతడు బోరున విలపించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అర్బాజ్ అలీ (ఫైల్)

నియామకాలు

బీసీ సెంట్రల్ కమిటీ గ్రేటర్ అధ్యక్షురాలిగా లక్ష్మి

బర్కత్‌పుర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ సెంట్రల్ కమిటీ గ్రేటర్ అధ్యక్షురాలిగా బాలినేని లక్ష్మి, ఓబీసీ అనుబంధ దళిత సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా సైదులును నియమించారు. వారికి కమిటీ చైర్‌పర్సన్ ఎం. భాగ్యలక్ష్మి గురువారం నియామకపత్రాలు అందజేశారు.



సైదులు, లక్ష్మికి నియామక పత్రాలు అందజేసిన భాగ్యలక్ష్మి

బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్

బర్కత్‌పుర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యదర్శిగా అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ గురువారం నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. బీజేపీ పటిష్ఠతకు కృషి చేస్తానని, రాబోయే రోజుల్లో విద్యార్థి, నిరుద్యోగ, రైతు, కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని పేర్కొన్నారు.



బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా శేషసాయి

రాంనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు రొయ్యూరు శేషసాయి నియమితులయ్యారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ ఆయనకు గురువానం నియామక పత్రం అందజేశారు. శేషసాయి బీజేపీలో పలు విభాగాల్లో బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠతకు తన వంతు కృషి చేస్తానన్నారు.



శేషసాయికి నియామకపత్రం అందజేస్తున్న శ్యాంసుందర్‌గౌడ్

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

ముషీరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ముషీరాబాద్ హెరిటేజ్ హాల్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నామని మీడియాసెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు గురువారం తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ పాల్గొంటారని, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.



ఇఫ్తార్ విందులో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ఇఫ్తార్ విందులతో మత సామరస్యం పెంపు

ముషీరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మతసామరస్యాన్ని పెంపొందిస్తున్నాయని మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం దాయార మార్కెట్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వాహిద్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రతియేటా ఇఫ్తార్ విందులకు సహకరిస్తున్న ప్రముఖ సంఘ సేవకుడు సలీమ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నేత శ్రీనివాస్, సిరిగిరి శ్యామ్, సత్యనారాయణ, సిద్దిక్, సమీర్, వెంకటేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



కాచిగూడ లింగంపల్లి చౌరస్తాలోగల ఉత్తరాదిమఠంలో వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం నిర్వహించారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొని పూజలు చేశారు.

- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి